
# ప్రజ్ఞాత్ములైన
# పాలె వ్యక్తులు



పాపం, రాఘవయ్యగారు మృత్యు ముఖ ద్వారం వద్ద పడున్నాడు, ఆరునెల్ల నుండి ఆ ద్వారం రెక్కలు సహం మటుకే తెరుచు. కుని—మాబుగా — అలావుండి పోయినై, యీ ఆరునెల్ల నుండి. ఆ రెక్కలు సాంతం తెరుచుకున్న సెకండ్లమీద పాపం, రాఘవయ్యగారు పరలోకాలకెళ్ళిపోతాడు; పరలోకాలంటే ఒకటి స్వర్గం, రెండోది నరకం.

రాఘవయ్యగారు ఒక వేళ చస్తే (యింకా జీవం వున్నవాణ్ణి కాస్తా— పాపం!) ఆయన స్వర్గానికెళతాడా ఆనే అంశంపై తర్కాలు కూడా (బహిరంగంగా కాదనుకోండి) కొందరు చేసివున్నారు.

కాని, రాఘవయ్యగారు చచ్చి, చచ్చినట్టు నరకానికెళ్ళేది ఖాయం అయినా ఆయనక్కడ నరకోద్యోగులకు లంచాలు పెట్టి "స్వర్గానికి బదిలీ" చేయించుకోగలడని కొందరు తుచ్ఛులు ఒకప్రచారం లేవదీశారనే వార్తలు కొందరి చెవిన పడినై కూడా.

వైద్య శాస్త్రరీత్యా రాఘవయ్యగారు ఆరునెల్ల కిందటే "చచ్చిన వాడికింద జమ" అని ఆయనకు వైద్యం చేస్తున్న ఆ ప్రఖ్యాత డాక్టరు స్పెషలిస్టులు (తమలో తామే సుమండీ!) నిర్ణయించారు. ఒకవేళ తాము నిజంగా ఆరునెల్ల కిందటే రాఘవయ్యగారికి "ఆశలేదు" అని బహిరంగంగా చెప్పివుంటే కొంప మునిగి వుండేది! నలుగురినోటా తమ వైద్యశాస్త్ర నిర్ణయం తప్పుడురకమని ప్రచారమై తమ ప్రాక్టీసు నోట గడ్డిమెత్తే వారు— యింకా నయం.

అయితే ఆ చచ్చినవాడు యిన్నాళ్ళూ ఏ అగోచర శక్తుల రక్షణలోనో యింకా బతుకుతూ నిక్షేపంగా ఆ పట్టె మంచంలో పడుండే తన వ్యాపార కార్య కలాపాలు ఎలా చక చక చేసుకు పోతున్నాడో— యీ నాటికీ అంతు పట్టక మెలికలు తిరిగిపోతున్నారు, ఆ ప్రముఖ డాక్టరు.

రాఘవయ్యగారు కొందరి చేత లక్షాధికారిగానూ, యింకొందరి చేత కోటీశ్వరుడుగానూ గుర్తించబడివుండిన వాడై వుంటంతో ఆయన రోగస్థితి గతుల్ని గురించి అనేక వాకబులూ, చర్చలూ సిద్ధాంతీకరణలూ కోలాహలంగా ప్రకటనలవుతూ వుండటం, అంత అసహజమేంకాదు.

"పాపం రాఘవయ్యగారు ఎట్లా వున్నాడో ఏమో మరి. మనకు నేరుగా తెలిస్చావదామ, ఎట్ట చస్తాం!" అన్నారు వీధి జనంలో ఒకరు.

"మరిపాపం, ఆర్నెల్ల కిందటే కింద పెట్టారన్నారు, ఆయనింకా బతికున్నాడన్న మాట!" యింకోరన్నారు.

"వోరు ముయ్యరా ఎదవా! ఎవరన్నా యింటే నీపొళ్ళు రాలిపోను! ఆయన లచ్చాదికారి! పున్నెమా అంటూ కొన్ని వేలమంది పనోరు ఆయన సేతిమీద బతుకుతుండారు!" అన్నారు మరొకరు.

"ఆయనకి పెద్ద వ్యాపారాలున్నాయ్! నలుగురికి పెట్టి తిన్నాకే నాలుగు రాళ్ళు మిగల్చుకుంటాడు. మరందరికీ అట్టాటి పనులు చేతకాదే?" అదృష్టవంతుణ్ణి చెరచాలేము, దురదృష్టవంతుణ్ణి బాగువరచాలేము!" అన్నాడింకో సౌమ్యుడు.

"అక్కర్లేదు, మీరాయనకు పన్లు చేయడం మానేస్తే ఆయనా నెత్తినో తట్టతో వచ్చి మీ కూలిజనంలో చేర్తాడు!" అన్నాడో కాకినిక్కరు మనిషి.

"అదేంజరిగేది కాదులేవయ్యా! యిట్టనే ముందో రెండుసార్లు పనికెల్లం బిగతీసేతలికి కొత్తోరిని తెప్పిచ్చి మావన్లు చేయించుకుండారు! కాదుగూడ్దని సబలు పెట్టేతలికి కీళ్ళు యిరగబొడ్సి కొట్టో పార్యాకారు! యిగనంతే, యవారం సప్పబడింది." ఒక శ్రామికుడన్నాడు.

"ఒరేయ్, దేనికిరా ఆసచ్చే ఆయన్ని గురించి ఎల్లబోసుకుంటారు! ఆయనబాగా బతికుండప్పుడు అదేదో సివర్దాకా ఎలగ

పెట్టక పోయినారంట్రా ?" అనో తల నెరిసిన మనిషన్నాడు.

"సత్తన్నాడు సత్తన్నాడని యీళ్ళు నోళ్ళు పారేసుకుంటూ వుండారేగాని, ఆ రాగవయ్యగారి యాపార యవారాలన్నీ ముంగలకన్నా బాగానే ఆ మంచంమీద పొడుకునే సెక్రం తిప్పతుంటాడంటగా ?" అన్నాడింకో ఆచూకీలు తీసే మనిషి.

"ఓ పక్క ఏ రోజుకారోజు ఆడాకటేర్లు ఆయనగార్ని సూసి తెల్ల మొగాలేత్తుండారంటారు, యింకో పక్క యాపార యవారాలు మాబాగా నడుపుతా వుండారంటారు — యిదంతా ఏదో తికమకగా వుండదే ?" అన్నాడింకో ఆచూకీదారు.

"డబ్బు సంచిలొచ్చి వోళ్ళో కూకోటం రుసిమరిగినోడు తను సత్తానని తెలవగానే ఆ సంచుల్ని యిర్గకాత్తె గట్టిగా వాటేసుకుంటాడు !" అన్నాడో మనిషి.

"వెనక భీష్మాచార్యులవారికి ఓవరం వుండేదిట, తను యిష్టప్రకారంచావడానికి! మన రాఘయ్యగారికి అలాంటి శక్తులున్నాయ్యంటే నేనాశ్చర్య పడను !" అన్నాడోస్కూలు మాష్టరు.

"ఏమి యీకలికాలం ! రాఘవయ్యగార్ని ఎవరింత వల్లెత్తుమాట అన్నా వార నోళ్ళు పురుగులుపడిపోతయ్ ! ఆయన పుణ్యాత్ముడు ! ఆ మహాతల్లి బెజవాడ కనకదుర్గకు మొక్కారా, ఆ తల్లి ద్వార బంధానికి బంగారంపూత పూయించటం ఎవరెరగరూ ? తిరపతి కొండదార్లో నాలుగు చలివేంద్రాలు కట్టించింది ఎరగం ? ఎగువ తిరపతి మీద ధర్మశాలకూడా కట్టించారే ? రమణాశ్రమానికీ అరవిందాశ్రమానికీ కొన్నివేలు దానం చెయ్య లేదా ? శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏటా ఎన్నిసార్లు పందిళ్ళు వేయించి అన్నదాలు వేయించ లేదు ? భగవాన్, రాఘవయ్యగారి సొమ్ము తింటూ ఆయన చావుకోర్తున్న కృతఘ్నుల నెందుకు సృష్టిస్తావు ? యీ ఘోరకలికి అంతం ఎప్పుడు ?" అన్నాడో భక్తుడు.

o o o o

ఈ దుష్ట ఘడియల్లో భూలోకంలోని రాఘవయ్యగారి మృత్యువు తాలూకు క్లిష్టసంఘటన ఒక విషమ సమస్యగా స్వర్గ, నరకాధిపతుల శిరస్సులపై పిడుగల్లే టపీమని పడింది !

స్వర్గ, నరకాధి పతులు ప్రత్యేక సలహా సభ్యులైన ఒక దేవగణం మురా అకస్మాత్తుగా హుటా హుటీ ఆ ఉభయ లోకాధి పతుల ముందుకొచ్చి నుంచున్నారు.

"ఓ స్వర్గ, నరకాధి పతులారా, మీ అజాగ్రత్తవల్ల మన దివ్యశక్తులపై ఒక అనిర్వచనీయమైన అప్రదిష్ట విరుచుకు పడింది ! యిప్పటికైనా మీ కళ్ళు తెరువండి !" అని ఎలుగెత్తి పలికారా దేవగణ సలహా సంఘసభ్యులు.

"విషయం విశద పర్చండి !" అన్నారు ముక్తసరిగా స్వర్గ, నరకాధి పతులు, ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ.

"భూలోకవాసి, రాఘవయ్య నామధేయుడనే మహాధనికుడు చచ్చీ చావకుండా మనమృత్యు కవాటం ముందు పడివున్నాడు ! ధన్వంతరిని తలదన్నే భూలోకంలోని మహా మేధావులైన కొందరు డాక్టర్లు ఆ రాఘవయ్యను మృతుడికింద ఏకగ్రీవంగా పరిగణించారు ! ఆ విధంగా ఏకగ్రీవంగా పరిగణింపబడిన ఆ మృతుడు తక్షణమే తెరువ బడవలసిన మనమృత్యు కవాటం కుండా అటు స్వర్గానికో యిటు నరకానికో తమ నిర్ణయాను సారం చేరవలసి యుండెను ! కాని సకాలంలో ఆ రాఘవయ్య నామధేయుడికి లోకప్రాప్తి కలగవలసింది తమ వుపేక్ష వలన నిర్ణయించబడక, మృత్యుకవాటం రెక్కలు మధ్యలోనే ఆగిపోయి, మన దేవలోకాలపై పూర్వం మనంకనీ వినీ ఎరుగని అప్రదిష్ట విరుచుకు పడింది ! యిందుకు మీ సమాధానం ఏమిటి ?" అని నిక్కచ్చిగా

అడిగారా దేవగణ సభ్యులు.

"ఓ విజ్ఞులారా, సర్వకాల సర్వావస్థల యందూ మెళకువతో మెలిగే మీ అమోఘదృష్టికి యీనాడైనా ఆ రాఘవయ్య నామధేయుడి స్థితి తెలిసివచ్చినందులకు మేమెంతో సంతసించు చున్నాము!

"పూర్వం కొంచెము యీలాగే— యీ రాఘవయ్య నామ ధేయుడికి సంబంధించిన సంఘటనల్లాంటి సమస్యలే మమ్ముల నెదుర్కొనుటూ వాటిని మేము — మీ దృష్టి పథానపడకుండానే కావచ్చు — ఏదోవిధంగా సర్దుబాటు చేసి నటులగానూ తెలుపు చున్నందుకు మీర న్యధా భావించనవసరంలేదు; కాని యీనాడు మీరీ కొత్త సమస్యను బహిరంగంగా మా ముందుంచుచున్నందున మిమ్ముల సమాధాన పర్చుట మాధర్మమని భావించు చున్నాము.

"కాని నేడీ రాఘవయ్య నామధేయుడు తెచ్చిపెట్టివున్న విషమ సమస్యలాంటి దానిని పూర్వం మేమేనాడూ ఎరిగి వుండ లేదు! యీ మానవుడు తన జీవితంలో కొన్ని వేల శ్రమజీవుల శ్రమ ఫలితాన్ని కృత్రిమ సాధనలద్వారా స్వాహాచేస్తూ కోట్లధన మార్జించిన మహాపాపిగా ఒక పక్కనవుతే, యింకొక పక్క దేవస్థానాలకు ధర్మశాలలు కట్టించి, దేవాలయ ద్వారముకు బంగారపు పూతలు పూయించి, దేవాలయ పర్వత మార్గముల యందు చలివేంద్రములు కట్టించి, మూల విరాట్టులకు ఆభరణములు చేయించి, అన్నదానములు గావించి యిత్యాది దైవ ప్రీతిపొందే పుణ్యకార్యములు చేసినవాడైనందున మేము తగుమాత్రపు చిక్కులలో పడివుండగా, యీ మానవుడు తన జీవితార్జన అయిన ధనళక్తుల్ని మృత్యు ఘడియలలో వదలలేక తన బాహుబంధములో బంధించివేసి, మధ్యమధ్య "నారాయణ నామస్మరణ" చేయుచున్నాడు! మే మెదుర్కొనుచున్న అసలు కఠోర సమస్య యిక్కడే వున్నదని మీరు గ్రహించవలెను!

"పూర్వం (మన దేవలోకాల దురదృష్టంకొద్దీ) మన ఉన్నతాధికారులైన ఆది దైవాలు త్రిమూర్తులు, కొందరి భక్తుల "తమ నామస్మరణ", ముఖప్రీతులకు లొంగి, వారికి వరప్రదానములు గావించి యున్నారు! అందులో ఒక విచిత్ర ఉదంతాన్ని తమ ముందు వుంచు చున్నాము!

"పూర్వం క్రూరాత్ము డజామీళుడు నారాయణ యనుచు నాత్మబంధువు బిలువన్" అని ఒక "ఆజన్మపాపి" అయిన అజామీళుడనువాడు తనమృత్యు సమయమందు యాదృచ్ఛికంగా ఆ శ్రీమన్నారాయణలని పేరు ఉచ్చారణ చేసినందున శ్రీమన్నారాయణుడా పాపికి స్వర్గ ప్రాప్తి కలిగించియున్నాడు!


"బహుశా మే మెలాంటి విపరీత విపత్కర పరిస్థితిలో వుండి వుందీ మీకిప్పుడు పూర్తిగా అర్థమైవుండగలదని మా నమ్మకము!

"ఆ శ్రీమన్నారాయణుడు మన ఉన్నతాధికారి! ఆయన ఎట్టి పరిస్థితులలో ఎంత దూరమాలోచించి ఆ పాపికి స్వర్గ ప్రాప్తి కలిగించాదో? అంత మాత్రాన మనము స్వతంత్రముగా అట్టి చర్యనే యీ రాఘవయ్య నామధేయుడి విషయములో తీసుకొనగలమా? యిదొక దీర్ఘాలోచనాంశమని మీరు గ్రహించ గలరు!

"ఇట్టి క్లిష్ట పరిస్థితిలో మా కర్తవ్య మేమిటనే యీ చర్చనీయాంశాన్ని మన ఉన్నతాధికారులు త్రిమూర్తుల ముందుంచ నిర్ణయించినాము! యీ మా సందిగ్ధావస్థ మూలముగానే మన మృత్యు కవాటములు సగమే తెరుచుకుని వుండిపోయినవని మీరు గ్రహింపగలరు!"

ం ం ం

అది రాఘవయ్యగారి భవనంముందు




వున్న పెద్ద ఆవరణ. ఆయనగారి అనేక వ్యాపారాల్లో పనిచేస్తున్న అనేక శాఖల వందలమంది శ్రామికులూ ఆఫీసులవారూ అక్కడ గుమిగూడారు. ఆవరణకు ఒక పక్కగా ఒకపెద్ద వేపచెట్టూ, ఆ చెట్టు చుట్టూ విశాలమైన నాపరాతి తిన్నె వున్నాయ్. తెల్లటి పొందూరు ఖద్దరు కంఠె మెడ జుబ్బా, పంచా, పై ఉత్తరీయం, పాతిక అంగుళం మేర అంటకత్తెర వేసిన సహాం నెరిసిన తలా, మందమైన అద్దాలకు మందమైన చట్రం వున్న కళ్ళజోడూ, వంకి చేతి కర్రతో చువ్వల్లే పొడుగ్గా, ముందుకి వొంగి ఆ వేదికమీద మాట్లాడుతున్నది రాఘవయ్యగారి మేనేజరూ, ఆంతరంగికోద్యోగైన వెంకట్రంగయ్య, అందుకై జన్మించాననుకొనే పూర్ణ విశ్వాసి.

"బహుశ మీకు తెలిసుండదు, మిమ్మల్నెందుకు యిక్కడ సమావేశపర్చానో?" అని అందర్నీ ఒకసారి ఎడమనుండి కుడికి అర్ధచంద్రాకృతిలో దృష్టి తిప్పుతూ చూశాడు వెంకట్రంగయ్య, ముక్కు మధ్యకు దిగిన కళ్ళద్దాలగుండా గంభీరంగా చూస్తూ.

"పాపం, మన యజమానీ మహాదాతా మెత్తని వెన్నపూసలాంటి మనసువున్న రాఘవయ్యగారు, ఆరునెల్లనుండీ అస్వస్థతగా వుండం మీకు తెలుసు. అలా అస్వస్థత ప్రారంభమైన నాటినుండి నేటివరకూ పాపం, ఆయన మనసు సహాం భగవధ్యానంలోనూ మిగతా సహాం మీమీదా, మీ శ్రేయస్సుకోసం పరితపిస్తున్నదని నేనంటే మీరాశ్చర్యపడకండి; ఎందుకంటే, మరా భగవంతుడాయన్ని అలా సృష్టించాడు!" అంటూ అందర్నీ ఇంకోసారి కలియ చూశాడు, వెంకట్రంగయ్య.

సభలో నిశ్శబ్దం.

"పాపం, మన రాఘవయ్యగారు పూర్ణారోగ్యం పొంది, ఆయన సహజ మందహాసంతో మన కళ్ళముందర మరల సర్వదా కనుపిస్తుండాలని భగవంతుని ధ్యానిద్దాం! అందుకు శాస్త్రపండితుల్ని రప్పించి, భారీ ఎత్తున భజనలూ, పూజలూ అన్నదానాలూ జరిపించాలని పెద్దల సంకల్పం! అందుకు మీ సంపూర్ణ సహాకారం లభించి పూజలు వగైరా దివ్యంగా జరిపించగలరని నా

దృఢ నమ్మకం!" అంటూ మరొక్క పర్యాయం సభంతా చూశాడు, వెంకట్రంగయ్య.

సభలో నిశ్శబ్దం.

"మీ బుద్ధి నాకు బాగా తెలుసు! నేను తెలిపిన పెద్దల సంకల్పం గురించి మీ అభిప్రాయం ఏమిటని అడుగుతున్నా?" చెప్పాడు వెంకట్రంగయ్య.

"ఏ అభిప్రాయం?" అడిగారు, సభలోంచి.

"మీ సహకారం గురించి!" చెప్పాడు వెంకట్రంగయ్య.

"ఏ సహకారం?" అడిగారు సభలోంచి.

"వింతగావుంది! లోగడ నేను కొన్ని సందర్భాల్లో మీ సహకారం అడగటం, వెంటనే అది లభించడం గుర్తుచేస్తున్నాను! యింకా బాగా గుర్తుండేందుకు,అయ్యగారి చిరంజీవులైన ప్రథమ ద్వితీయ పుత్రుల వివాహసందర్భంలో ఆ సహకారం అందచేసిన ట్లు గుర్తు చేస్తున్నాను — తెల్సిందిమరి?" చెప్పాడు వెంకట్రంగయ్య.

"ఎర్రి మొగాల్లార, ఏంది అట్టసూత్తారు మాట్టాడండి మరి-?" అన్నారొకరు, సభలో.

"ఎవర్ది ఎర్రిమొగం, ఓ సెంప రెణ్ణెల్ల జీతండబ్బులు ఖకాయిబెట్టి కూకుం టేనూ?" అన్నారు మరొకరు, సభాలో.

"పాపం, మన రాఘవయ్యగారు మీతో మరీమరీ చెప్పమన్నారు, అనారోగ్య కారణంగా జాప్యం జరిగిందనీ, మీ జీతాలు మీకు ఏరోజు అందినా అందచ్చనీ చెపుతున్నారు; ఆయన మనసు మీకు తెలుసు," అన్నాడు వెంకట్రంగయ్య.

"జీతం డబ్బులిత్తే నాలుగు మెతుకులు తిన్నాక పూజలెవారం సూడచ్చులెండి!" అన్నారు సభలో.

"పాపం అహర్నిశలూ మిమ్మల్ని మీ కుటుంబాల్నీ పోషిస్తున్న ఆ ధర్మదాత యిక్కాళ రోగంతో పడుంటే మీరావిధంగా నిలవదీయడం అధర్మం! యీ విషయం తెలుస్తే ఆయన మనసెంత క్షోభిస్తుందో మీకెలా తెలుస్తుంది?" తన విచారం తెలిపాడు వెంకట్రామయ్య.

"ఇంతకీ మమ్మల్నాయన వూరకనే పోసిత్తున్నాడనంటయ్యా నువనేదీ?" అడిగారు, సభలోంచి.

"రామ రామ! అలా మీ రనుకోటమే వెర్రితనం, అనంటాను! ఆయనకు సర్వాధికారాలున్నా మిమ్మల్నే ఎప్పుడూ ఎందుకు పనిలో పెట్టుకుంటున్నారో మీరేనాడైనా ఆలోచించారా? దీని అర్థం ఏమిటి?" అని సభను ప్రశ్నించాడు, వెంకట్రంగయ్య.

"మేం ఎప్పుడు గిట్టకపోయినా పన్లో నించి పూడబెరికి ఎల్లమంటానే వుండిరిగా?" అన్నారు సభలోంచి.

"చీమ చిన్నదైనా కుడ్తే విలవిల్లాడిపోతాం, అవునా? మన రాఘవయ్యగారు పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు అధికారి. ఆ సంస్థలన్నీ తన శరీరం తాలూకూ అంగ, ఉపాంగాలుగా భావిస్తాడాయన. చివరకు ఏ చిన్న ఉపాంగంవద్ద పనివారా యన్ని చికాకు పర్చినా ఆ చీమల్నల్లే వార్ని విసర్జించక తప్పటంలేదు మరి- అయినా యిదంతా అప్రస్తుత ప్రసంగం అనుకోండి-యిహ అసలు విషయానికొద్దాం-" అంటూ సభవేపు చిన్నగా నవ్వాడు వెంకట్రంగయ్య

o o o

ఏ వేపు చూసినా నున్నగా తళతళ మంటూ విశాలంగా వున్న ఆగదిలో పెద్ద మెత్తటి పట్టెమంచంమీద ఆరునెల్ల నుండీ మృత్యువు నెదుర్కొంటున్న కోటేశ్వరుడు, రాఘవయ్యగారు పడుకునున్నాడు, అక్కడ సమావేశమైన తన అంతరంగికుల్ని ఆప్యాయంగా చూస్తూ.

అక్కడ సమావేశమైంది వెంకట్రంగయ్య లాంటి డజనుమంది మేనేజర్ల నదుపుచేయగల శక్తిపరుడూ అంతరంగిక ఉన్నతాధికారైన సుబ్బారాఘుడూ,

మేనేజరు వెంకట్రంగయ్యా, రాఘవయ్య గారి భార్య రామలక్ష్మి, కొడుకులు రఘునారాయణ, రామనారాయణ, రాజనారాయణలూ, కూతురు అరుణా వున్నారు.

"నావడక కుదర్డంలేదు—తీసెయ్యండి-" అన్నాడు రాఘవయ్యగారు, లోతైన భావిలో పడినవాడి గొంతల్లేవున్న పీల గొంతుతో.

"తమకు వేసిన ఆమెత్త "ఇంపోర్టైడు" దండీ; అంతకన్న సుఖంగా వుండేమెత్త ఏమానవ మాత్రుడికీ అంత సులభంగా లభించటం అసాధ్యం!" అన్నాడు, పచ్చగా నున్నగా పండల్లే పండి, ఆ బట్టతల నెత్తిన స్వల్పంగా మిగిల్న స్వేతజాతి జుట్టు వరికల్లోనూ అదేజాతి వస్త్రాలతోనూ, ఆగరుడ ముక్కుపై స్వర్ణసులోచనాల్తోనూ వున్న, సుబ్బారాయుడు.

"నీ బుర్ర పెద్దది — లోపల సరుకు చిన్నది — మార్చండి పడక," అన్నాడు రాఘవయ్యగారు, కసురుతూ.

ఫోము పడక మార్చి మెత్తటి కృత్రిమ జూలు రోజాయిమీద ఆయిన్ని పడుకో పెడుతుంటే, అదీవద్దని మూలిగి, ఆ స్పటికల్లాంటి పాముకళ్ళతో చురచుర చూస్తున్న రాఘవయ్యగార్ని చివరకు కటిక పట్టెమంచంమీదే పడుకోపెట్టారు, అందరూ కలిపి.

"ఎంత ధనం, ఎన్ని భోగాలున్నా ఏం ప్రయోజనం, అనుభవించంది! ఏనాడు యింత తింటానికి నోచుకోలేదు-యీనాడు ఏదీ యిమడకనేపోయె-చివరికి ప్రాణానికింత సుఖమన్నా వుంటుందనుకున్న మెత్తటి పక్కకూడా వొద్దంటున్నారు-ఏమి చేయను?" అంటూ గుడ్లనీరు కుక్కుకుంది, భార్య రామలక్ష్మి.

కొంచెం తేరుకున్నాక, సుబ్బారాయుడూ, వెంకట్రంగయ్యలను ప్రశ్నార్ధకంగా చూశాడు, రాఘవయ్యగారు.

"చిత్తం, తమ మనసు గ్రహించి, వెంకట్రంగయ్య సభను ఏర్పాటు చేయించి వార్ని అడగటమైంది; బకాయిలో వున్న ఆ రెండు నెలల జీతాలు-ముందర అందాలన్నారు-" అన్నాడు సుబ్బారాయుడు, మాటలు నెమరేసుకుంటూ.


"చిత్తం, తమ అస్వస్థత కారణంగా జీతాలివ్వడంలో స్వల్ప జాప్యం జరిగిందనీ, రేపో మాపో యివ్వనున్న ఆ రెణ్ణెల్ల జీతాల్లోంచి పూజల తాలూకు చందా తగ్గించుకుంటే, వారికీ అంతగా ఏమీ అనుపించదనీ నచ్చచెప్పాను!" వివరాలు తెలిపాడు వెంకట్రంగయ్య.

"ఓ పదిమంది ఎదురుతిరిగి మిగతావార్ని రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తుండగానే వార్ని అక్కణ్ణుంచి తరలించాము; కాని వారు మనకు చాలాకాలంనుండి కావలసినవారై వుంటంలో సమయం సద్వినియోగపర్చుకునేందుకు వార్ని 'రైటింగు' కేసుల్లో యిరికించాల్సి వొచ్చింది మరి-" సారాంశం తెలిపాడు సుబ్బారాయుడు.

"చూశారా సుబ్బారాయుడుగారూ-నీతీ నిజాయితీ న్యాయం, ధర్మం-ప్రత్యక్షంగా మన కళ్ళముందర ఎలా అమలు జరుగుతున్నదో?" అన్నాడు రాఘవయ్యగారు, క్షీణ స్వరంతో.

"చిత్తం, తమ అంతర్యం-?" గుటక మింగాడు సుబ్బారాయుడు.

"ఎన్ని ఏళ్ళనుంచో నా పరిశ్రమల్లో పనిచేస్తున్నవార్ని-ఎక్కడా నాగా అంటూ లేకుండా-(కొన్ని విషమ పరిస్థితుల్లో మినహాయించి) ప్రతినెలా వారివారి జీతాలు పువ్వుల్లో పెట్టి యిస్తూ రావడం మీకు తెలుసుగదా?ఆ డబ్బుల్తో వారివారి భార్యాబిడ్డలు ఎంత సుఖంగా జీవిస్తున్నారో మీరు చూస్తున్నారుగదా? స్ట్రయికులంటూ చేసినప్పుడు గత్యంతరంలేక కొందర్ని బయటికి పంపుతే-పాపం వారి భార్యాబిడ్డలొచ్చి నా కాళ్ళావేళ్ళా పడుతుంటే-నేనెంత బాధపడేవాడినో మీరు గమనిస్తుండే వారుగదా? నన్ను వేధించటానికి క్కాక




పోతే-యివాళ వారిలా అఘాయిత్యం చేయటం దేనికి చెప్పండి?" అన్నాడు రాఘవయ్యగారు, విచారంగా.

"చిత్తం, తమ మనసు వెన్నపూస లాంటిదని లోకం అనుకుంటుంది!" అన్నాడు సుబ్బారాయుడు.

"తమ సత్వర పూర్ణారోగ్య నిమిత్తం భగవద్ ప్రార్థనలూ పూజలూ హోమాలూ జరిపించేందుకు ఫిట్టర్లు, టాంకర్లు, వెల్డర్సు, మెల్టర్సు, ఆయిల్ మన్‌లు, డ్రిల్లర్లు, పోర్ మన్‌లు, డ్రయివర్లు, హెల్పర్లు, కూలివారు, ఇంజనీర్లు, ఆఫీసు గుమాస్తాలూ వగైరా మొత్తం పదివేల మంది నుండి, తాహతులవారీగా, అయిదూ పదీ ఇరవైలు, వారికి ముట్టవలసిన రెండు నెలల జీతాలనుండి పూజల చందా మినహాయింపులు ఏర్పాటుచేశాము!" వివరాలు తెలిపాడు వెంకట్రంగయ్య.

"నేను నిమిత్త మాత్రుణ్ణి—ఈశ్వరాజ్ఞ లేంది ఈగైనా ఎగరదు! మీరు వెళ్ళిరండి—" అన్నాడు రాఘవయ్యగారు, తన కుటుంబ సభ్యుల వేపు తలతిప్పుతూ.

"మిమల్ని యివాళ ఎందుకు పిలిపించానో మీకు—తెలిసే అవకాశంలేదు—కాని కొన్ని వూహాలు చేయగలరు— ఆరు నెల్ల నుండీ నేనీ మంచం మీద వేళ్ళాడ్డం వల్ల—" కుటంబంతో మాట్లాడటం ప్రారంభించాడు, రాఘవయ్యగారు.

"నా జీవితం ఒకే ధ్యేయం ఒకే లక్ష్యంతో నడిచింది. ధనార్జనకు నేను చేసిన వ్యాపారాలూ అందుకు తీసుకున్న చర్యలూ అన్వేషించని మార్గాలూ—దిగ విడిచినవి బహుశ ఏమీ మిగిలుండవు! ధన శక్తిని మించిందీ అది సాధించనిదీ యీ భువిలో మరేదీ లేదనే జ్ఞానం చిన్ననాటి నుండీ నాలో పెంపయి, లోతుగా నాటుకు పోయింది! యీ జ్ఞానార్జన గురించి ఎవరైనా తప్పుపడ్తే వార్ని వెర్రికుట్టల కింద జమకట్టండి! యీ జ్ఞానంలోని ఒక నిత్యాగ్ని హోమం, నాకొక ఉక్కు కవచంగా పనిచేసింది!

"నేను నిజంగా వ్యాధిగ్రస్తుణ్ణే; [illegible] మృత్యువాత పడవలసిన వాణ్ణి కూడా! నిదర్శనకు నా డాక్టరు స్పెషలిస్టులే సా

య్యం! కాని, ధనార్జనాన్ని నాలో ఎంత బలమైన శక్తిగా రూపొందిందంటే, నన్ను బలిద్దామనొచ్చిన మృత్యుదేవతను సైతం రారెత్తించిందని నేను నమ్మిన సత్యం! యీ సంఘటనపై శాస్త్రపరిశోధలు జరుగుతే నేనాశ్చర్యపడను! కమ్మని సంగీతం వింటే ఆవులు అధికంగా పాలిస్తాయని శాస్త్రజ్ఞులు రుజువు చేశారు! నా మనస్థితీ ఆ తెగదై ఎందుకు వుండకూడదూ?

"పిచ్చముండాకొడుకులు — తాము వైద్యంలో స్పెషలిస్టులమని ఆ డాక్టర్లు విర్రవీగుతున్నారు! కాని నా వ్యాధి స్థితి ఎక్కిందాన వారికంతుబట్టక గింజుకు ఛస్తున్నారు—బైట పెట్టరుగాని!

"కాని, నా యీ కృత్రిమ స్థితి ఎక్కువ కాలం నిలిచేది కాదు-నా సహజ జీవశక్తులు నాలో ఎప్పుడో ఆరిపోయినందువల్ల నేను వాటిపోయేముందు నేనార్జించిన ధన సంపత్తుల (యిది డబ్బుకు నా వాడుకపదం) పరిరక్షణకు మీ వారసత్వాల్ని గుర్తుచేసి కొన్ని హెచ్చరికలు మీతో ముఖాముఖి తెలుపడమే నా కడసారి కోరిక. ఆ కోరిక తీర్తే నా ప్రాణి సుఖంగా వెళ్ళిపోతుంది!" అని తన రక్తబీజాలున్న తన కుటుంబాన్ని ఆశగా చూశాడు, రాఘవయ్య.

"మీ కోరిక తీరేందుకు మా ప్రాణా లొడ్డుతాం, చెప్పండి మీ కోరిక" ముక్త కంఠంతో తెలిపారు కుటుంబ సభ్యులు, ఒక్క కూతురు అరుణ తప్ప.

ఈ అపశ్రుతి రాఘవయ్యగారు గమనించక పోలేదు.

"రఘునారాయణా" జ్యేష్టకుమారుడితో ప్రారంభించాడు, రాఘవయ్యగారు "నీకు స్త్రీ వ్యసనం, మధుపానంపట్ల సంధి ఎక్కువ! కాని నీతి అవినీతుల్ని గురించిన వ్యర్థ చర్చలు చేసే నైజం కాదు నీది నీ అభ్యాసాలకు ధనావసరం మెండు! అందుకు నీ శక్తి ధారపోస్తావని నా నమ్మకం; కనుక నా ఆస్తి రక్షణకు వుండవలసిన బీజాలు నీలో వున్నయ్! కానీ యిందుకు తోడు నువ్వు దైవకార్యాలు బహిరంగంగా ఎంత పెంచుకుంటే నీ స్థితికి అంత పుష్టి ఏర్పడుతుందని అనుభవపూర్వకంగా నా సలహా.

"రామనారాయణా" రెండో కొడుకుతో అన్నాడు, రాఘవయ్యగారు "నీలో గుఱ్ఱం పందాల దీర్ఘవ్యాధి నీ రోమరోమానికీ పట్టింది! గుఱ్ఱాలు పరుగెత్తగలవనే విషయం మినహా వాటికి కొమ్ములున్నయ్యో, ఏ కాళ్ళు బాగా ఎత్తుతయ్యో తెలుసుకునే వ్యవధి నాకు దొరికింది కాదు. నీలో కూడా ధనావసర బీజాలున్నాయి గనుక నీ అన్నకు చెప్పిందే నీకూ చెల్లుతుంది.

"రాజనారాయణా" మూడో కొడుకుతో అన్నాడు "ఉదయం" గంటలకు నీకు మనయింట్లో తెల్లవారి, కాలకృత్యాలూ జపతపాలూ అల్పాహారాలతో నీ నిత్యజీవిత కార్యక్రమాలు క్లబ్బుల్లో ప్రారంభమవుతయ్యనేది జగద్విదితం. నీకూ ధనతృష్ణ వుందిగాని అందుకు కావలసిన అమూల్య కాలవ్యవధి క్లబ్బుల పాలవుతున్నదనే చింతే నన్ను వేధిస్తున్నది. నా ఆర్జన సంప్రదాయాన్ని నువ్వు నిలపలేవేమోనని నాకు సందేహాలున్నాయ్, ఏమిటి నీ సమాధానం?"

"నాన్నగారూ, మన దేశంలో మన సమాజంపై ఆర్థిక యాజమాన్యశక్తులున్న పెద్దలకు కూడలిస్థలం క్లబ్బులు! యీ పెద్దల సంపర్కాలూ మైత్రీ మనిషి మనగడకు క్షేమం అనీ వ్యాపార దక్షతకు యీ అభ్యాసం మొదటి మెట్టనీ నేను గ్రహించి, యీ పద్ధతనుసరిస్తున్నానని మనవి." వివరించాడు, రాజనారాయణ.

"నాయనా రాజనారాయణా, కొన్ని అమృతవాక్కులు నా చెవిన వేశావు! యింక నీగురించి నాకే శంకాలేక, అనుమానాల్ని రద్దు చేసుకుంటున్నాను. మీ ముగ్గురు సోదరులు వెళ్ళొచ్చు." అని భార

రామలక్ష్మివేపు చూశాడు, రాఘవయ్యగారు.

"రామలక్ష్మీ, నిన్ను నేను ఏనాడూ నీ తిరుగుళ్ళనుండి అదుపు చేసేందుకు ప్రయత్నించలేదు—నాకూ ఆ అలవాట్లు కొన్ని వుంటంవల్ల, నీకు నేను న్యాయం చేసేవెళ్తాను. నీకుకావలసిన సంఘాల్లోనూ పూర్వంలాగానే నువు యథేచ్ఛగా నీకాలం వెళ్ళబుచ్చవచ్చు — యికనీవు వెళ్ళు—" మెడతిప్పి కూతురు అరుణను చూశాడు, రాఘవయ్యగారు

"నువు పూర్తిగా చెడిపోయ్యావు!" సూటిగా ప్రకటించాడు రాఘవయ్యగారు, అరుణకళ్ళల్లోకి చురచుర చూస్తూ.

"ఏ విధంగానో చెప్పండి?" అడిగింది అరుణ, కొంచెం ఆశ్చర్యపడ్తూ.

"నువొక గాంగులీదరూ, దగుల్బాజీ, సామ్యవాద కుట్రదారుతో భుజాలు పూసుకుంటూ వాడి కొంపవెంట తిరుగుతున్నావని తెలిసింది — కాని నువ్వు అదొక సరదగా భావిస్తుంటే మటుకు—అది వేరేవిషయం!" అరుణ కళ్ళల్లోకి పరికిస్తూ చూశాడు, రాఘవయ్యగారు.

"నాకు ఎవరి భుజాలూ పూసుకుంటూ ఎవరి కొంపలెంటా తిరిగే సరదా అలవాట్లు లేవు నాన్నగారూ. మీరు ఎవర్నిగురించో పొరపాటున నాతో అంటున్నారనుకుంటా." అన్నది అరుణ.

"నేనువ్యర్థ ప్రసంగిని కాను, అరుణా. నేనెవర్నిగురించి మాట్లాడుతున్నదీ ఆ వ్యక్తి ఎవ్వరైది కూడా నీకు బాగా తెలుసు! నువు మన అంతస్తుకు తూగే ఎవరివెంట తిరిగినా నాకు బాధకలగదు, నువ్వా బాజారు గాడిద, పచ్చిరౌడీ—నా పని వాళ్ళనురేపి, వారివెనుకనుండి నాకు వ్యతిరేకంగా సమ్మెలనెగదోసే వుండాకోరు, రామశర్మవెంట నువు పడడంవల్ల నా తల ఎక్కడపెట్టుకున్నానో నీకు తెలుస్తోందా? యిప్పుడు చెప్పు నీ సఫ్యతేమిటో?" క్షీణ స్వరంతో అరిచాడు, రాఘవయ్యగారు.

"ఇప్పుడర్థమైంది, ఎవర్నిగురించి మీరు మాట్లాడుతున్నదీ" రామశర్మ నా బాల్య



## నిశ్శబ్ద కవచం

**అడబాల**

అనుభవించిన నిశ్శబ్దాల్ని
బిళ్ళలు బిళ్ళలుగా కోసి
నా చుట్టూ పేర్చుకుంటాను
ఎవడో ఓ మూర్ఖుడు
రూప లేని తన వాదనాఖడ్గాన్ని
నా మీదకంటా విసిరినప్పుడు
ఆ బిళ్ళలనే
కవచంగా అల్లుకుంటాను
క్షేమంగా తొడుక్కుంటాను

స్నేహితుడు, మీరుపయోగించిన దుర్భాష అతన్నంటదని నాకు బాగా తెలుసు! అతను మానవతావాది, నిస్వార్థి, సంస్కారం వున్న విద్యార్థికుడు, యింకొకరి కష్టాలు తనవిగా భావించి శక్తికొద్దీ వారిని ఆదుకో గలడని మటుకే అతన్ని గురించి నాకు తెలుసు. అతని నిత్యకార్య కలపాల్ని గురించి నేను ఆరాలు తీయను. తీసినా అతన్నిగురించిన నా అభిప్రాయాలు మారే అవకాశం లేదు. ఎవరి అంతస్తుల్నిబట్టి వారితో వూరేగే సభ్యత నాకింకా అబ్బ లేదనికూడా మీకు తెలుపగలను." అన్నది అరుణ, స్ఫుటమైన మాటల్తో.

"పూర్తిగా అర్థమైనది, నీ అనుకృతినే సభ్యత! మీ అమ్మకన్నా నీకబ్బిన వంశ భ్రష్టమైన సభ్యత రెండాకులు ఎక్కువ మోతాదులో వుంది! మన సంస్కృతీ మనసాహిత్యం, మన కళలంటూ పాపం మీఅమ్మ, ఎన్నిగడపలు తొక్కినా కొంచెం లౌక్యం కనబర్చేది! నీసంస్కారం పచ్చి నాటురకం—అరుబయట సరుకు—నేనా శించే నా రక్తం నీలో మచ్చుకైనా లేదు —నా సంపదలో భాగం అనుభవించే యోగ్యత నీకులేదు—నాదనేది చిల్లిగవ్వ కూడా నీకు దక్కదు—ఫో—" ఆవేశంలో రాఘవయ్యగారి కళ్ళు మసకలై—చీకట్లు కమ్మినై.

○ ○ ○ ○

"మా నాన్న నిన్నూ నన్నూ చాలా హీనంగా దూషించాడు!" అన్నది అరుణ, రామశర్మతో, దాపరికం లేకుండా.

"బహుశ నువ్వు నాతో బహిరంగంగా తిరగడం మీ నాన్న పరిభాషలో మహా దోషమై వుంటుంది — యీ విషయమై నిన్నెప్పుడో హెచ్చరిద్దా మనుకున్నాను, అరుణా—కాని నాది స్వార్థ బుద్ధి—నన్ను తప్పుపట్టకు" అన్నాడు రామశర్మ.

"లేదులేవయ్యా, అందులో మన యిద్దరి స్వార్థంవుంది గనక నిన్నొక్కణ్ణే తప్పు పట్టుకోకు మరి! రామశర్మా, యివాళ మానాన్న మనసు చూసినంతగా ముందు ఏనాడూ అంత అవకాశం కలగ లేదు! ఆయనెప్పుడూ తన వ్యాపారాల్లో మునిగి తేల్తూ ఏ అర్థరాత్రో యింటికి వస్తుండంవల్ల మా మధ్య వుండవలసినంత సాన్నిహిత్యం ఏనాడూ లేకుండా పోయింది; యిన్నాళ్ళు దూరంగా వుండి పోయిన నాకు ఆయనెంతో గొప్పవ్యక్తిగా కనుపించేవాడు, ఆర్నెల్లపాటుగా ఆయన రోగాన పడున్నా కూడా తన వ్యాపార వ్యవహారాలు ఆరోగి పడక దగ్గిరకూడా వెంటాడుతుంటంవలన మమ్మల్ని అక్కడ క్కూడా పిలిచెరగడు. యివాళ నాకా కొరత తీరింది!" అన్నది అరుణ విచారంగా.

"మీ నాన్న కోటీశ్వరుడు, ధనికుడనే వాడు అనేక మందికి అనేక రూపాల్లో కనుపిస్తాడు. యివాళ నువ్వు తండ్రిగా ఆయన్ని ముద్దుకన్నాదగ్గరగా చూశావు; కాని ప్రథమంగా ఆయన మనసు నీముందు విప్పటంవల్ల నువ్వు ఆశించిన — లేక వూహించిన నీతండ్రికి మారుగా యింకొక వింత రూపాన్ని చూసివుంటావు! కారణం

నీ తండ్రి సంస్కారానికి పూర్తిగా భిన్నమైంది, నీసంస్కారం !

"బ్రహ్మాండమైన "కాడిలాక్" కార్లో పోతుంటే వీధి జనానికాయన పూర్వజన్మ సుకృతుడు గానూ, మీ భవనం అంతస్తు మీద కనుపిస్తే "లక్ష్మీవర పుత్రుడుగానూ, సభల్లో అగ్రపీఠం అలంకరించి "జాతకుడు" గానూ, దగా సంస్థలకు 'దాత' గానూ, లంజకు 'ధనరాశి' గానూ, ఆఫీసు మేనేజర్లకు 'దీనబంధు' గానూ, ఫ్యాక్టరీ శ్రామికులకు 'విలన్' గానూ, సాక్షాత్కరిస్తాడు, మీనాన్న !" అన్నాడు రామశర్మ.

"అర్థమైంది నీ చమత్కారం—చాలు ! నాన్న తన ఆస్తినుండి ఒక్కచిల్లిగవ్వయినా నాకివ్వనన్నాడు !" బయటపెట్టింది అరుణ.

"మీతండ్రి తన స్వార్జితంపై సార్వాధికారి !" అన్నాడు రామశర్మ.

"నా తండ్రి తల్లీ అన్నయ్యలు రోజూ డబ్బునేవిధంగా వాడుకుంటున్నదీ అదిఎలా ఆర్జించ బడుతున్నదీ కొంతనేను ప్రత్యక్షంగా చూసినందువల్లనో ఏమో నాకు ధనద్వేషం పుట్టిందని యివాళ తెలుసుకున్నాను ! నాన్న చిల్లిగవ్వనాన్న యివ్వనంటుంటే నాకు చీమకుట్టినట్టన్నా అనిపించలేదు ! నేను మా వంశంలోచెడబుట్టినట్టుంది !" అన్నది అరుణ.

"అరుణా, నీలో నేను నిజమైన మానవరూపం సాక్షాత్కరించటం చూస్తున్నా !" అంటూ అరుణ మెత్తటి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు, రామశర్మ.


100ml బాటిలుకొని

**95 పైసలు ఆదా చేసుకోండి**

# 'క్రివేణి' ఇంకు

**ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో**
**100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుచున్నది.**

00ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-25
(స్థానిక పన్నులు అదనం)
వినియోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.




తయారు చేయువారు :

**కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ**

751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-60008 .